క్లుప్తంగా

ఎన్టీపీసీకి ప్రతిష్టాత్మక అవార్డు



ఎన్టీపీసీకి లభించిన ట్రోఫీ

పరవాడ: ఎన్టీపీసీకి మరో ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. మహిళా సాధికారతలో కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్, పార్టనర్‌షిప్ విభాగంలో ఎన్టీపీసీ మొదటి రన్నరప్‌గా ఎంపికైంది. ఢిల్లీలో గత నెల 29న జరిగిన కార్యక్రమంలో ఎన్టీపీసీ తరఫున జనరల్ మేనేజర్ హెచ్‌ఆర్, సీఎస్సార్ ఎల్‌ఏపీ అండ్‌ఆర్ వి.జయనారాయణన్ యూఎన్ వుమెన్ ఇండియా డబ్ల్యూఈపీఎస్–2024 అవార్డును అందుకున్నారు. షోంబి షార్ప్ ఆర్‌సీవో, యూఎన్ రెసిడెంట్ కో–ఆర్డినేటర్ సమక్షంలో ఈ అవార్డును స్వీకరించారు. బాలిక సాధికారత మిషన్(జీఈఎం) ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్న ఏకైక సంస్థ ఎన్టీపీసీ అని అధికారులు తెలిపారు. అణగారిన వర్గాలకు చెందిన ఆడపిల్లలకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా ఎన్టీపీసీ పనిచేస్తోందన్నారు.

సీఐఎస్ఎఫ్ పోర్టల్ ప్రారంభం



సీఐఎస్ఎఫ్ ఈసేవా బుక్ పోర్టల్ ప్రారంభిస్తున్న ఎన్టీపీసీ ప్రతినిధులు

పరవాడ: సీఐఎస్ఎఫ్ ఈసేవా పోర్టల్ ద్వారా నూతన యుగం ప్రారంభమవుతుందని ఎన్టీపీసీ ప్రతినిధులు పేర్కొన్నారు. భారత ప్రభుత్వ నేషనల్ డిజిటల్ ఇండియాతో సీఐఎస్ఎఫ్ ఈసేవా పోర్టల్ బుక్‌ను ప్రారంభించిందని వివరించారు. ఇది ఫోర్స్ సభ్యులందరికీ అందుబాటులో ఉంటుందన్నారు. పదవీ విరమణ చేసిన సిబ్బందికి రిటైర్మెంటు తేదీలోగా అన్ని పెన్షనరీ ప్రయోజనాలు పొందేలా చూసేందుకు సీఐఎస్ఎఫ్ ఈసేవా పోర్టల్ దోహదపడుతుందని చెప్పారు. ఏటా సంస్థలో 2400 మంది పదవీ విరమణ చేసిన సిబ్బందికి ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూర్చుతుందని ఎన్టీపీసీ అధికారులు వెల్లడించారు.

అప్పన్న సన్నిధిలో మంత్రి వాసంశెట్టి సుభాష్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న వాసంశెట్టి సుభాష్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం రాష్ట్ర కార్మికశాఖ, వైద్యశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని, జ్ఞాపికను ఏఈవో ఆనంద్‌కుమార్ అందజేశారు.

అప్పన్న చందన సమర్పణ పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు రశీదు అందజేస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందన సమర్పణ పథకానికి శనివారం నగరంలోని సీపీఎం కాపౌండ్‌కు చెందిన ఆరిశెట్టి శ్రీ ఆశిష్ రూ. 1.05 లక్షల విరాళాన్ని అందజేశారు. సంబంధిత నగదును ఆలయ ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్‌కు అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు ఏఈవో రశీదు అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని అధికారులు అందజేశారు.



తిక్కవానిపాలెంలో రోడ్లు, కాలువలు లేని జగనన్న కాలనీ



బేసిమెంట్ లెవెల్‌లో నిలిచిపోయిన ఇల్లు



ముళ్ల పొదల మధ్య కలపాక జగనన్న కాలనీ

బేసిమెంట్ లెవెల్ - 214	బిలో బేసిమెంట్ లెవెల్ - 94	లింటల్ లెవెల్ 8	రూఫ్ లెవెల్ - 22	శ్లాబులు వేసినవి - 25	పూర్తి చేసిన ఇళ్లు - 446	మొత్తం - 809

పేదల ఇళ్లపై కినుకు

- జగనన్న కాలనీలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఇళ్లు పూర్తయినా మౌలిక సదుపాయాలు కల్పించని వైనం

పరవాడ:

గత ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ పక్కా ఇళ్లు నిర్మించాలన్న తపనతో ఇంటి పట్టాలు అందించింది. ఇంతలో ఎన్నికలు రావడం..కూటమి అధికారంలోకి రావడంతో జగనన్న కాలనీల్లో పరిస్థితులు తలకిందులయ్యాయి. గత ప్రభుత్వ అధికారంలో కొందరు ఇళ్లను పూర్తి చేసికొని నివాసం ఉంటుండగా...మరికొందరి ఇళ్లు వివిధ దశల్లో నిలిచిపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి అధికారం చేపట్టిన తరువాత జగనన్న కాలనీలపై గృహ నిర్మాణ శాఖ అధికారుల పర్యవేక్షణ అంతంతమాత్రంగా ఉండడంతో అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వం మండలంలో 8 లే అవుట్లలో 1,568 ప్లాట్లు కేటాయించి లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు అందజేసింది. పై ప్లాట్లలో 809 మంది లబ్ధిదారులు హౌసింగ్ స్కీం వర్తింపజేసింది. అందులో 446 మంది లబ్ధిదారులు ఇళ్లను పూర్తి చేశారు. మిగిలిన వాటిలో 214 ఇళ్లు బేసిమెంట్ స్థాయిలో ఉండగా మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన జగనన్న కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలు లేక ఇళ్లను నిర్మించుకోవడానికి లబ్ధిదారులు సముఖత చూపించడం లేదు. పూర్తయిన కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలో తిక్కవానిపాలెం లేఅవుట్‌లో తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం, వాడచీపురుపల్లి ప్రాంతాల లబ్ధిదారులు 600 గృహాలను కేటాయించారు. వారిలో 147 మందికి హౌసింగ్ స్కీం వర్తింప జేయగా 69 మంది మాత్రమే ఇళ్లను పూర్తి చేసుకున్నారు. మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి.

ఇదిలావుండగా తమ గ్రామాలకు సుదూర ప్రాంతమైన తిక్కవానిపాలెంలో ఇళ్ల స్థలాలు కేటాయిస్తే మేం ఇళ్లను నిర్మించుకోలేమని సొంత గ్రామాల్లో ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరుతూ నాయుడుపాలెం, వాడచీపురుపల్లి గ్రామాలకు చెందిన లబ్ధిదారులు ప్రభుత్వానికి విన్నవించుకొన్న నేటి వరకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆ రెండు గ్రామాల ప్రజలు ఇళ్లను నిర్మించకుండా వదిలేశారు. ఈ కాలనీలో మత్స్య కార్మికులు నిర్మించుకున్న జగనన్న కాలనీల్లో తాగునీరు, రోడ్లు, కాలువలు వంటి కనీస సదుపాయాలు ప్రభుత్వం కల్పించలేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లో వాటర్ ట్యాంకు నిర్మిస్తామని ఇచ్చిన హామీ నెరవేరలేదని వాపోతున్నారు. వెన్నలపాలెం జగనన్న కాలనీలో 290 ఇళ్లను మంజూరు చేయగా 206 ఇళ్లు పూర్తి చేశారు. పరవాడ–2లో జగనన్న కాలనీలో 88 ఇళ్లకు గానూ 51 ఇళ్లను పూర్తి చేశాయి. ఈ కాలనీల్లో కనీసం వీధి రోడ్లు, మురుగునీటి కాలువలు నిర్మాణం జరగలేదు. వీధి రోడ్లు లేక రేషన్ వాహనం కాలనీలోకి రావడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధుల్లో కాలువల నిర్మాణం జరగని కారణంగా మురుగు నీరు ఇళ్ల పక్కనే నిలిచిపోయి దోమలు బెడదత మరింత పెరిగిందని వాపోతున్నారు.

కలపాక జగనన్న కాలనీలో 90 మందికి ఇళ్లు మంజూరు వారిలో 39 మంది మాత్రమే ఇళ్లను నిర్మించారు. మరి కొన్ని ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. కాలనీలో సదుపాయాలు లేక ఇళ్లు నిర్మించుకొన్న వారు ముందుకు రావడం లేదు. ఇంత వరకు రోడ్లు, కాలువల నిర్మాణం ఊసే లేదు. ఈ.బోనంగిలో 74 ఇళ్లను మంజూరు చేస్తే 41 ఇళ్లను పూర్తి చేశారు. పి.బోనంగి లేఅవుట్లలో 120 ఇళ్లను మంజూరు కాగా 30 గృహాలు మాత్రమే లబ్ధిదారులు నిర్మించుకొన్నారు. ఈ కాలనీలకు కూడా కూటమి ప్రభుత్వం మౌలిక సదుపాయలు కల్పించడంలో తాత్సారం చేస్తుండడంతో మిగిలిన ఇళ్లను ఏ విధంగా పూర్తి చేసుకోవాలో అంతుపట్టడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తిక్కవానిపాలెంలో ఇళ్లు నిర్మించకుండా వదిలేసిన ప్రభుత్వ స్థలం

తాగునీటికి ఇబ్బంది



కాలనీలో వాటర్ ట్యాంకు నిర్మించి తాగునీరు సరఫరా చేస్తామని అధికారులు ఇచ్చిన హామీని నేటి వరకు అమలు చేయలేదు. రోడ్లు,కాలువలు లేక అవస్థలు పడుతున్నాం. గతంలో నిర్మించిన ఇళ్లకు ఏర్పాటు చేసుకున్న బాత్‌రూమ్‌లకు చాలా మంది లబ్ధిదారులకు పేమేంట్లు జరగక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు చర్యలు తీసుకోవాలి.

–దూడ ముత్యాలు, తిక్కవానిపాలెం

రేషన్ బండి రావడం లేదు



కాలనీలో రోడ్డు సదుపాయం లేక నిత్యావసరాల వాహనం వీధుల్లోకి రావడం లేదు. రేషన్ సరకులు అందడం లేదు. చెత్త బండి కూడా రావడం లేదు. చెత్త కుప్పలు ఎక్కడికక్కడ పేరుకుపోతున్నాయి. కాలువలు నిర్మించకపోవడం వల్ల మురుగునీరు బయటకు వెళ్లడం లేదు.

–నక్కా నూకరత్నం, గృహిణి, వెన్నలపాలెం

కనీస సదుపాయాలు కరవు



కలపాకలో నిర్మించిన జగనన్న కాలనీ కనీస సదుపాయాలకు నోచుకోలేదు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడం వల్ల కొంత మంది తమ ఇళ్లను పునాదుల స్థాయిలోనే నిలిపేశారు. పునాదుల్లో తుప్పలు డొంకలు మొలుస్తున్నాయి. విష సర్పాలు ఇళ్లలోకి చొరబడుతున్నాయి. రోడ్లు, మంచినీరు, విద్యుత్ సదుపాయాలు కల్పించి ఆదుకోవాలి.

–ఇందల శ్రీను, కలపాక

వెంకటాద్రిపై కన్నుల పండువగా అఖండ దీపోత్సవం





దీపాల నడుమ పూజలందుకుంటున్న వెంకన్న, పాల్గొన్న భక్తులు

పెందుర్తి: కార్తిక మాసం ముగింపు సందర్భంగా స్థానిక వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం నుంచి స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ చేశారు. దూపసేవ, దీపోత్సవం, నామార్చన, అష్టోత్తరం నిర్వహించారు. పలువురు భక్తులు స్వామివారికి తులాభారం సమర్పించి మొక్కులు చెల్లించారు. సాయంత్రం వెంకటాద్రి కొండ తొలి మెట్టు నుంచి శిఖరం వరకు దీపాలు వెలిగించారు. దీపోత్సవం కన్నుల పండువగా సాగింది. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈవో నీలిమ, ఆలయ కమిటీ చైర్మన్ ఎం.ఎస్ రాజు, ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు, వేలాదిగా భక్తులు పాల్గొన్నారు.

కాలనీల్లో మౌలిక వసతుల కల్పన



సామాజిక పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు



వెన్నలపాలెంలో వృద్ధులకు పింఛను అందజేస్తున్న ఎంపీడీవో శ్యామసుందర్

పెందుర్తి: జీవీఎంసీ పరిధిలోని కాలనీల్లో పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తెలిపారు. జీవీఎంసీ 97వ వార్డు కార్మికనగర్, గిరిప్రసాద్‌నగర్, క్రాంతినగర్, ప్రశాంతినగర్, ఆక్సిజన్ కాలనీ, ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీల్లో పంచకర్ల పర్యటించారు. స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు రమేష్‌బాబు సూచించారు. ముందుగా ఆయా కాలనీల్లో ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. కార్పొరేటర్ శానాపతి వసంత, టీడీపీ నేత శానాపతి శంకర్రావు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

పరవాడ: మండలంలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లను శనివారం 15 గ్రామ పంచాయతీల్లో పంపిణీ చేసినట్టు ఎంపీడీవో శ్యామసుందర్ తెలిపారు. మండలంలో 6,535 పింఛనుదారులుండగా శనివారం 6,103 మందికి పంపిణీ చేశామన్నారు. ఒక్క రోజులోనే అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగుల సహకారంతో 93.61 శాతం పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీవో శ్యామసుందర్ చెప్పారు.

మొగలిపురంలో..

సబ్బవరం: లబ్ధిదారుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ అన్నారు. మండంలోని మొగలిపురం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగటి నానాజీ, గండి సత్యం, బైలపూడి రాంబాబు, రాళ్లపల్లి బండయ్య, గోటివాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నాకవుట్‌కు దగ్గరగా ఆంధ్ర

విశాఖ స్పోర్ట్స్: దేశవాళీ ధనాధన్ టీ–20 క్రికెట్ నాకవుట్‌కు ఆంధ్రా జట్టు దగ్గరవుతోంది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో భాగంగా విశాఖ వేదికగా గ్రూప్ డీ మ్యాచ్‌లు జరుగుతుండగా.. ఆంధ్రా జట్టు గ్రూపు 'ఈ'లో హైదరాబాద్ వేదికగా ఆడుతోంది. గ్రూప్‌లో 7 రాష్ట్ర జట్లు తలపడుతుండగా.. ఆంధ్రా జట్టు ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించి 12 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. తర్వాత మ్యాచ్‌లో 12 పాయింట్లతో సమ ఉజ్జీగా కొనసాగుతున్న కేరళ, ఎనిమిదేసి పాయింట్లతో కొనసాగుతున్న సర్వీసెస్, ముంబయి జట్లతో ఆడాల్సి ఉంది. గ్రూప్‌లో విజేతగా నిలిస్తే నేరుగా నాకవుట్‌కు చేరుకునే అవకాశం ఉంది. గతేడాది ఆరో స్థానంలో ఆంధ్రా జట్టు నిలిచి.. గ్రూప్ స్టేజ్‌లోనే నిష్క్రమించింది.

రాణిస్తున్న విశాఖ కుర్రాళ్లు

ఆంధ్రా జట్టుకు నాయకత్వం వహిస్తున్న విశాఖ కుర్రాడు రికీబుయ్ గోవాతో జరిగిన మ్యాచ్‌లో 72 పరుగులతో నిలిచి మ్యాచ్ బెస్ట్‌గా నిలిచాడు. వికెట్ కీపర్ భరత్ కూడా ఈ మ్యాచ్‌లో 57 పరుగులతో రాణించాడు. ఐదు క్యాచ్‌లు పట్టి జట్టు విజయంతో కీలకపాత్ర పోషించాడు. మీడియం పేసర్ శశికాంత్ ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ సత్తాచాటి మొత్తంగా ఆరు వికెట్లు తీశాడు. అవినాష్ ఒక మ్యాచ్‌లోనే ఆడగా 55 పరుగులు చేసి మ్యాచ్ బెస్ట్‌గా నిలిచాడు.

బెస్ట్ వికెట్ టేకర్ జగ్జీత్‌సింగ్ : ఇక విశాఖ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌ల్లో చండీగఢ్, విదర్భ జట్లు 12 పాయింట్లతో ఆధిక్యానికి పోటీపడుతున్నాయి. అసోం, పుదుచ్చేరి జట్లు 8 పాయింట్లతో కొనసాగుతుండగా రైల్వేస్, చత్తీస్‌గఢ్ జట్లు నాలుగేసి పాయింట్లను ఖాతాలో జమచేసుకున్నాయి. కాగా.. 38 జట్లు పోటీపడుతున్న ఈ టోర్నీలో విశాఖ వేదికగానే ఆడుతున్న చండీగఢ్ ఆటగాడు జగ్జీత్‌సింగ్ నాలుగు మ్యాచ్‌ల్లో 11 వికెట్లు తీసి టోర్నీలో బెస్ట్ వికెట్ టేకర్‌గా కొనసాగుతున్నాడు. రైల్వేస్ బ్యాటర్ వివేక్ సింగ్ ఆడిన మూడు ఇన్నింగ్స్‌లో 226.92 స్ట్రయిక్‌రేట్‌తో మూడో బెస్ట్‌గా నిలిచాడు. అయితే విశాఖలో వర్షం కురుస్తుండటంతో ఆదివారం జరిగే మ్యాచ్‌లపై ఉత్కంఠ నెలకొంది. వరుణుడు కరుణిస్తే ఉదయం చత్తీస్‌గఢ్‌తో ఒడిశా, డేనైట్ మ్యాచ్‌లో విదర్భతో రైల్వేస్ ఆడనుంది.

'తాగూర్ పరిశ్రమపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి'



ఆస్పత్రి వద్ద బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న గనిశెట్టి సత్యనారాయణ

పరవాడ: ఫార్మాసిటీలో తాగూర్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో అస్వస్థతకు గురైన వారికి మెరుగైన వైద్యం అందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వద్ద బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి భరోసా కల్పించారు. అనంతరం వారితో మాట్లాడుతూ ఆస్పత్రిలో క్షతగాత్రులకు అందుతున్న వైద్య సేవలు, ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ప్రకటించాల్సిన ప్రభుత్వం కేవలం రూ.40 లక్షలు ప్రకటించి చేతులు దులుపుకోవడం సిగ్గుచేటన్నారు. ఈ చర్యను కార్మిక వ్యతిరేక చర్యగా పరిగణిస్తున్నామన్నారు. పరిశ్రమలో ప్రమాదకర విష వాయువులు పీల్చి అస్వస్థతకు గురైన వారికి మెరుగైన వైద్యం అందించాలని, ప్రమాదానికి కారణమైన యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన



సీఐఎస్ఎఫ్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న సీఐఎస్ఎఫ్ అధికారులు

పరవాడ: సీఐఎస్ఎఫ్ సిబ్బందికి మానసిక ఆరోగ్యంపై సేవలందించడానికి ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్ట్ (ఏబీఈటీ) తో సీఐఎస్ఎఫ్ న్యూఢిల్లీలో నవంబరు 8న ఒప్పందం కుదుర్చుకుందని ఈ ఎంవోయూపై సంతకం చేశామని సంరక్షిత సెక్రటరీ కె.శ్రీవాస్తవ, అధ్యక్షుడు ఫర్వీస్ షేక్‌లు తెలిపారు. ఈ ఒప్పందం ప్రకారం సీఐఎస్ఎఫ్ సిబ్బందికి, వారి కుటుంబసభ్యులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.

నాణేల కోసం మత్స్యకారుల అన్వేషణ

ఏయూక్యాంపస్: సముద్రం అనేక ప్రత్యేకతల సమాహారం. అటువంటి సముద్రానికి మరో ప్రత్యేక లక్షణం కూడా ఉంది. తనలో ఏదీ దాచుకోకుండా అన్నీ తీరానికి తోసేస్తుంది. ఈ సూత్రం ఆధారంగా చేసుకుని మత్స్యకారులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. తుపాను కారణంగా చేపల వేటకు వెళ్లడం సాధ్యపడటం లేదు. ఖాళీగా ఉండటం ఇష్టం లేని మత్స్యకారులు సాగర తీరంలో నాణేల కోసం అన్వేషించడం కనిపించింది. శనివారం ఉదయం విశాఖ సముద్ర తీరంలో పదుల సంఖ్యలో మత్స్యకారులు సముద్రంలోకి కొట్టుకుని తీరానికి వచ్చే నాణేలను సేకరించే పనిలో పడ్డారు. వివిధ సందర్భాలు, పూజలు చేసినపుడు ప్రజలు సముద్రంలో విడిచిపెట్టే నాణేలు ఇటువంటి సమయంలో తీరానికి కొట్టుకొస్తాయి. కెరటం వెనక్కి వెళ్లగానే నాణాన్ని గుర్తించి వాటిని ఒడిసి పట్టుకోవడం మత్స్యకారులకు వెన్నతో పెట్టిన విద్య. దీనికోసం వర్షంలో సైతం వారు అలలకు ఎదురుగా నిల్చుని, గంటల తరబడి నిరీక్షిస్తూ వీటిని సేకరిస్తారు.

జీవన శైలి మార్పుతోనే ఎయిడ్స్ నియంత్రణ



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

సబ్బవరం : ఆరోగ్యవంతమైన జీవన శైలిని అనుసరించడం ద్వారా ఎయిడ్స్‌ను నియంత్రించవచ్చని సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి పేర్కొన్నారు. సబ్బవరంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ నియంత్రణ కోసం జాగ్రత్తలను తీసుకుంటూనే యోగా, ధ్యానంతో పాటు మంచి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ సమన్వయకర్త డాక్టర్ ఎం.రత్నం ప్రకాష్ , కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎస్.సత్యనారాయణ, డాక్టర్ వీవీ గోపాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి శంకర్, జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ లెక్కల గణేష్ పాల్గొన్నారు.

పిల్లలతో తల్లిదండ్రులు మమేకం కావాలి



సిబ్బంది, తల్లిదండ్రులతో విద్యార్థులు

పెందుర్తి: పిల్లలకు వచ్చే ఆలోచనలను పంచుకుని వారికి దిశా నిర్దేశం చేసేందుకు వీలుగా నిత్యం తల్లిదండ్రులు పిల్లలతో కొంత సమయం కేటాయించాలని రవీంద్రభారతి పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.స్వరూప అన్నారు. సుజాతనగర్‌లోని రవీంద్ర భారతి పాఠశాలో శనివారం తల్లిదండ్రులు–పిల్లలు ఎంగేజ్మెంట్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలను భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు తల్లిదండ్రులు తపన పడుతుంటారని..అయితే అదే సమయంలో పిల్లల మనసును కూడా అర్థం చేసుకుని ఏది మంచి ఏది చెడు అనేది చెప్పేందుకు ప్రయత్నం చేయాలన్నారు. లక్ష్య సాధనకు తల్లిదండ్రులే దిశా నిర్దేశం చేయాలని చెప్పారు. పలువురు తల్లిదండ్రులు వారి ఆలోచనలను పంచుకున్నారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎగసి పడుతున్న అలలు



తీరంలో ఉవ్వెత్తున ఎగసిపడుతున్న కెరటాలు (ఇన్‌సెట్) మత్స్యకారులకు సూచనలు అందజేస్తున్న మెరైన్ పోలీసులు

పరవాడ: వాయుగుండం తుపానుగా మారిన నేపథ్యంలో రెండు రోజులుగా పరవాడ మండలంలో వర్షాలు కురుస్తున్నాయి. తుపాను ప్రభావంతో ముత్యాలమ్మపాలెం సముద్ర తీరం అల్లకల్లోలంగా మారింది. సముద్రంపై కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతూ తీరాన్ని తాకుతున్నాయి. తీరం వెంబడి ఉధృతంగా ఈదురుగాలులు వీస్తున్నాయి. తుపాను హెచ్చరికలు నేపథ్యంలో తీరం ఒడ్డున ఉన్న పడవలు, వలలు, ఇంజన్లను మత్స్యకారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వచ్చే సోమవారం వరకు సముద్రంపై చేపల వేటకు వెళ్లవద్దని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. శుక్ర, శనివారాలు మెరైన్ పోలీసులు తీర ప్రాంతాలను సందర్శించి మత్స్యకారులకు పలు సూచనలు, సలహాలను అందజేశారు. మత్స్యకారులు తుపాను ఉధృతిని దృష్టిలో ఉంచుకొని అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ సిబ్బంది హెచ్చరించారు.

16 నుంచి ధనుర్మాసోత్సవాలు

అల్లిపురం: అల్లిపురం వెంకటేశ్వరమెట్టపై వేంచేసిన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో డిసెంబర్ 16 నుంచి జనవరి 13వ తేదీ వరకు ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతాయని ఆలయ ఈవో జి. వి.రమాబాయి తెలిపారు. స్వామి వారికి ప్రతిరోజు సుప్రభాత సేవ, ఆరాధన, ధనుర్మాస అర్చనలు, తిరుప్పావై వంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు.